సాక్షి
రంగారెడ్డి
సోమవారం ၊ 24 ၊ జూన్ ၊ 2024



పాల బిల్లులు చెల్లించాలి

పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను చెల్లించాలని పలువురు నాయకులు మంత్రి జూపల్లి కృష్ణారావుకు విన్నవించారు. 10లో▸



పచ్చిరొట్ట సాగు.. బాగు

రసాయన ఎరువులతో దిగుబడి తగ్గుతుందని పచ్చిరొట్టతో భూసారం పెంచుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. 10లో▸



మైనింగ్ జోన్ వద్దు

అంతారం సమీపంలో చేపడుతున్న మైనింగ్ జోన్ ఏర్పాటును రద్దు చేయాలని గ్రామస్తులంతా ఏకగ్రీవ తీర్మానం చేశారు. 10లో▸



అలలపై అలా.. హుస్సేన్ సాగర్ తీరంలో కొలువుదీరిన అమరవీరుల స్మారకం.. ఇటువైపు తథాగతుడు.. మధ్యలో రాష్ట్ర సచివాలయ సౌధం.. మరోవైపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం విద్యుత్ కాంతులతో తళుక్కున మెరిశాయి. నగరంలో వర్షం కురిసిన అనంతరం ఆదివారం రాత్రి వీటి ప్రతిబింబాలు సాగర్ జలాల అలలపై అందంగా కనిపించి కనువిందు చేశాయి.

న్యూస్‌రీల్

ఉత్తమ సేవా పురస్కారాలకు ఎంపిక



ఏసీపీ రంగస్వామి



షాద్‌నగర్ సీఐ ప్రతాప్‌లింగం



ఫైర్ స్టేషన్ ఆఫీసర్ జగన్

షాద్‌నగర్: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్న పోలీసు, అగ్నిమాపక శాఖల్లో పని చేస్తున్న అధికారులు ఉత్తమ సేవా పురస్కారాలకు ఎంపికయ్యారు. ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, ఫైర్ స్టేషన్ ఆఫీసర్ జగన్‌ను ఉత్తమ సేవా పురస్కారాలకు ఎంపిక చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పురస్కారాలను ప్రభుత్వం వారికి త్వరలో అందజేయనుంది. పురస్కారాలకు ఎంపికైన వారిని వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల సభ్యులు ఘనంగా సన్మానించారు.

శ్యామప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



కందుకూరులో మొక్క నాటుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

కందుకూరు: కశ్మీర్ భారతదేశంలో భాగమని ఎలుగెత్తి చాటిన నిజమైన దేశ భక్తుడు, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు శ్యామప్రసాద్‌ముఖర్జీ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖండ భారతావని కోసం ప్రాణాలర్పించిన భరతమాత ముద్దుబిడ్డ శ్యాంప్రసాద్‌ముఖర్జీ అని కొనియాడారు. ఆయన ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లేలా అందరూ దేశం కోసం సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు బొక్క మాధవరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి తేరటి లక్ష్మణ్‌ముదిరాజ్, జిల్లా పంచాయతీరాజ్ సెల్ కన్వీనర్ సాధ మల్లారెడ్డి, సీనియర్ నాయకులు జిట్టా రాజేందర్‌రెడ్డి, నల్లబోలు నర్సింహారెడ్డి, సురసాని భూమిరెడ్డి, సోమరాజు వెంకటేశ్, దేశం సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ హర్షణీయం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తుర్కయంజాల్: ఏక కాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించడం హర్షించదగ్గ విషయమని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. తుర్కయంజాల్ చౌరస్తాలో ఆదివారం మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు కొత్తకుర్మ శివ కుమార్, కౌన్సిలర్ కాకుమాను సునీల్, బొక్క రవీందర్ రెడ్డి, నాయకులు సామ భీంరెడ్డి, జుల్కాదర్ అలీ, గుండ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లు కల్పించాలని సీఎంకు వినతి

యాచారం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో ఉద్యమ, ఉపాధ్యాయ నాయకుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పీడీ, పీఈటీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాబయ్య, ప్రధాన కార్యదర్శి ఎండీ సాబేర్ కలిశారు. పీఈటీలను స్కూల్ అసిస్టెంట్‌లుగా ప్రమోషన్ కల్పించినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. పదోన్నతులు, బదిలీలు సైతం రంగారెడ్డి జిల్లాలో అమలు చేయాలని సీఎంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

గురి తప్పింది!

- సికింద్రాబాద్ ఫైరింగ్‌పై టాస్క్‌ఫోర్స్ వివరణ
- ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ప్రకటన
- ఇరువురిలో ఒకరిపై గతంలో మూడు కేసులు

బైక్ టైర్‌ను కాల్చబోతే స్నాచర్ కాలిలోకి తూటా

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌లోని సిటీలైట్ హోటల్ వద్ద యాంటీ స్నాచింగ్ టీమ్ పోలీసులు.. పారిపోతున్న స్నాచర్ల బైక్ టైర్‌ను కాల్చాలని ప్రయత్నించినట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ ప్రకటించారు. ఆ తూటా బైక్ వెనుక కూర్చున్న నేరగాడి కాలులోకి దూసుకుపోయినట్లు వివరణ ఇచ్చారు. గురువారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఉదంతంలో తప్పించుకున్న ఇద్దరు స్నాచర్లను పట్టుకున్నట్లు ఆదివారం టాస్క్‌ఫోర్స్ డీసీపీ పేర్కొన్నారు.

రెండు 'పనులు' చేస్తున్నా చాలక..

ఫలక్‌నుమాలోని అన్సారీ రోడ్ ప్రాంతానికి చెందిన మసూద్ ఉర్ రెహ్మాన్ పదో తరగతితో చదువుకు స్వస్తి చెప్పాడు. బతుకుతెరువు కోసం వెల్డర్‌గా, క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ రెండు పనుల్లోనూ వచ్చే ఆదాయం విలాసాలకు సరిపోకపోవడంతో తేలిగ్గా డబ్బు సంపాదించడంపై దృష్టి పెట్టాడు. దీనికోసం దోపిడీలు, చోరీలు చేయాలని పథకం వేశాడు. నాచారం, మైలార్‌దేవ్‌పల్లిల్లో మూడు నేరాలు చేసి జైలుకు వెళ్లాడు. ఈ కేసుల్లో బెయిల్‌పై బయటకు వచ్చిన ఇతడి వ్యవహార శైలి మారలేదు. మసూద్ తరచూ ముషీరాబాద్‌లో ఉండే తన బంధువు ఇంటికి వెళ్లేవాడు. అక్కడే ఇతడికి స్క్రాప్ వ్యాపారం చేసే ఫజల్ ఉర్ రెహ్మాన్‌తో పరిచయం ఏర్పడింది.

వాహనంపై తిరుగుతూ వరుస నేరాలు

సెల్‌ఫోన్ స్నాచింగ్స్ చేయాలని నిర్ణయించుకున్న మసూద్ తనకు సహకరించాల్సిందిగా ఫజల్‌ను కోరాడు. దీనికి అతడు అంగీకరించడంతో ఇద్దరూ రెండు కత్తుల్ని దగ్గర పెట్టుకుని బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై బయటకు వచ్చారు. తొలుత చాదర్‌ఘాట్‌లోని ఓ బార్ వద్ద ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశారు. ఈ వాహనాన్ని అదును చూసుకుని విక్రయించాలని భావించారు. అప్పటి వరకు భద్రంగా ఉంచడం కోసం భోలక్‌పూర్ వరకు తీసుకువెళ్లి ఓ ప్రాంతంలో దాచారు. అదే రాత్రి అట్నుంచి వీరిద్దరు సికింద్రాబాద్ వైపు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో రైల్వే స్టేషన్ సమీపంలోని గణేష్ టెంపుల్ వద్ద ఓ వ్యక్తి వీరికి కనిపించాడు.

కత్తులతో బెదిరించి సెల్‌ఫోన్ దోపిడీ

అతడిని అడ్డుకున్న వీరిద్దరు సెల్‌ఫోన్ గుంజుకోవడానికి ప్రయత్నించారు. బాధితుడు ఎదురు తిరగడంతో వాహనం దిగిన ఇరువురూ కత్తులతో బెదిరించి ఫోన్ లాక్కున్నారు. అక్కడి నుంచి తమ వాహనంపై క్లాక్ టవర్ వైపు వెళ్తూ తమ చేతిలో ఉన్న కత్తుల్ని చూపిస్తూ పాదచారులకు భయభ్రాంతులకు గురి చేశారు. ఇటీవల నగరంలో చోటు చేసుకున్న నేరాల నేపథ్యంలో యాంటీ స్నాచింగ్ టీమ్స్ రాత్రి వేళ గస్తీ నిర్వహిస్తున్నాయి. పాదచారుల అరుపులు సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్న బృందం చెవిన పడ్డాయి. అప్రమత్తమైన పోలీసులు ఆ ఇద్దరి వద్దకు చేరుకుని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. అయితే.. మసూద్, ఫజల్ కత్తులు చూపిస్తూ పోలీసులను కూడా బెదిరించారు.



పట్టుకునే ప్రయత్నంలో కాల్పులు..

అక్కడి నుంచి పారిపోతున్న ఇద్దరు నిందితులను యాంటీ స్నాచింగ్ టీమ్ వెంబడిస్తూ పోయింది. బాటా షోరూమ్ వద్ద మరో పాదచారి నుంచి ఫోన్ స్నాచింగ్ చేయడానికి వీళ్లు ప్రయత్నించి సిటీ లైట్ హోటల్ వద్దకు చేరుకున్నారు. వీరి వ్యవహారశైలిని గమనించిన ఇద్దరు పోలీసులూ పట్టుకోవడానికి చేసిన ప్రయత్నాల్లో భాగంగా వారి వాహనం ఆపాలని నిర్ణయించుకున్నారు. దీనికోసం తమ వద్ద ఉన్న తుపాకీతో దాని టైర్‌పై గురిచూసి



కాల్చారు. ఈ తూటా వాహనం వెనుక కూర్చున్న నేరగాడి కాలిలోకి దూసుకుపోయింది. మరో తూటా పేల్చినా ఫలితం లేకపోవడంతో ఇద్దరూ వాహనంపై పారిపోయారు. టాస్క్‌ఫోర్స్, నార్త్‌జోన్ పోలీసులు ముమ్మరంగా గాలించి ఇద్దరినీ పట్టుకున్నారు. వీరి నుంచి చోరీ సొత్తు, కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

గోల్డ్ ట్రేడింగ్ పేరిట రూ.150 కోట్లు కొట్టేశాడు

ప్రహణేశ్వరి ట్రేడింగ్ సంస్థ ఎండీ రాజేష్ అరెస్ట్





నిందితుడు రాజేష్

హిమాయత్‌నగర్: కేవలం అయిదు నెలల్లో డబ్బులు రెట్టింపు చేస్తామని నమ్మించి, గోల్డ్ ట్రేడింగ్ పేరుతో మోసాలకు పాల్పడిన నిందితుడిని నగర సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. హబ్సిగూడలో ప్రహణేశ్వరి ట్రేడింగ్ పేరుతో రాజేష్ అనే వ్యక్తి ఓ సంస్థను స్థాపించాడు. తాను సంస్థ ఎండీగా ఉంటూ గోల్డ్ ట్రేడింగ్ చేస్తున్నానని పలువురిని నమ్మించాడు. అధిక లాభాల ఆశ చూపి సుమారు 500 మంది నుంచి రూ.150 కోట్లకు పైగా కాజేసి పరారయ్యాడు. అధిక లాభాలకు ఆశపడి తమ ఇళ్లను, బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రూ. 5 లక్షల నుంచి రూ.కోటి వరకు బాధితులు పెట్టుబడులు పెట్టారు. రెండు నెలలుగా డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులకు అనుమానం వచ్చి అడిగితే అపుడు ఇప్పుడు అంటూ దాటవేశాడు. అనంతరం సంస్థ ఎండీ రాజేష్ పరారయ్యాడు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు నెలలుగా తప్పించుకుని తిరుగుతున్న రాజేష్‌ను కర్ణాటక రాష్ట్రం ఉడిపిలో సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఆదివారం రిమాండ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బాధితులు తమకు న్యాయం చేయాలంటూ బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళనకు చేపట్టారు. ప్రభుత్వం, పోలీసులు తమకు న్యాయం చేయాలని, తాము కట్టిన డబ్బులను ఇప్పించాలని వేడుకున్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందిస్తున్న ఆంజనేయులు తదితరులు

మినిమం స్కేల్ ఇవ్వండి

మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు

చేవెళ్ల: తెలంగాణ మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లకు మినిమం టైంస్కేల్ ఇవ్వాలని మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఆదివారం నగరంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో విద్యాశాఖప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, గౌరవ అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పటి నుంచి జీఓ 254 ప్రకారం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లకు మినిమం టైం స్కేల్ అమలు చేస్తున్నారని, మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకులంగా స్పందించారని తెలిపారు.

ఉత్సాహంగా ఒలింపిక్ రన్



చార్మినార్ వద్ద ఒలింపిక్ రన్‌ను ప్రారంభిస్తున్న మహేశ్

చార్మినార్: ఒలింపిక్ దినోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం చార్మినార్ నుంచి ఎల్‌బీ స్టేడియం వరకు ఒలింపిక్ రన్ నిర్వహించారు. 1894 జూన్ 23న అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ ఏర్పడిన రోజును పురస్కరించుకుని ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది ఒలింపిక్ రన్‌ను నిర్వహిస్తున్నారని.. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం చార్మినార్ నుంచి ఎల్బీ స్టేడియం వరకు కాగడాతో ఒలింపిక్ రన్ నిర్వహించినట్లు హైదరాబాద్ టగ్ ఆఫ్ వార్ అధ్యక్షుడు ఆదర్ల మహేశ్ తెలిపారు. కార్యక్రమంలో గౌలిపురా మిత్రా క్లబ్ బాక్సింగ్ కోచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చినుకు కునుకు కరువు

- ఊరించి.. ఉసూరుమనిపించి
- ముఖం చాటేసిన వరుణుడు
- ముందస్తుగా సాగు చేసిన పంటలు ఎండుముఖం
- ఆకాశంకేసి అన్నదాతల చూపులు

షాబాద్: వర్షాకాలం ప్రారంభమైనా జిల్లాలో ఇప్పటి వరకు ఒక్క భారీ వర్షం కూడా పడలేదు. వరుణుడు కరుణించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో ఆశలతో పంటల సాగుకు సిద్ధమై అన్నదాతలు నిత్యం ఆకాశం వైపు చూస్తున్నారు. నైరుతి రుతుపవనాల రాకతో భారీ వర్షాలు కురుస్తాయని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. పుడమితల్లి పులకించేలా వర్షం కురవకపోవడంతో పంటలు వేసేందుకు ఆలోచిస్తున్నారు. భూగర్భ జలాలు ఉన్న రైతులు కొందరు ముందస్తుగా పంటలు సాగు చేశారు. వర్షాలు పడితే పంటలకు ఇబ్బంది ఉండదనుకున్న వారికి నిరీక్షణే మిగిలింది. ఆరుద్రకార్తె ప్రారంభమైనా వర్షం కురువడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదైనా సకాలంలో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండుతాయని ఆశించిన వారి ఆశలు అడియాసలు అవుతున్నాయి. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 3.50 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు అందులో సగం మేర కూడా నారుమడులు పోయలేదు. గతేడాది మృగశిర కార్తె నుంచే వర్షాలు కురవడంతో దాదాపు జూన్ మధ్య వరకు ఆరు తడి పంటలను విత్తడం పూర్తయింది. ప్రస్తుతం వరుణుడి కటాక్షం లేకపోవడంతో జూన్ నెల చివరి వరకు వచ్చిన పంటలు విత్తడం సగం కూడా కాలేదు.

నీరుపోయని బోరు మోటార్లు

జిల్లాలో బోరుబావుల ఆధారంగా కొంతమంది రైతులు ముందస్తుగా రోహిణి కార్తె ప్రారంభం నుంచే పంటలు విత్తడం ప్రారంభించారు. ఇప్పటి వరకు భారీ వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో బోరు బావుల్లో నీటి మట్టం తగ్గిపోయింది. ఉన్న నీటికి వర్షాలు తోడైతే పంటలు మొలకెత్తుతాయని రైతులు ఆశించారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ భానుడి ప్రతాపం తగ్గకపోవడంతో నాటిన విత్తనాలు మొలకెత్తడం లేదు. కొందరు రైతులు పత్తి పంటను సాగు చేశారు. ప్రస్తుతం వానలు లేకపోవడంతో పరేషాన్ అవుతున్నారు. వర్షాలు లేకపోవడంతో పూర్తి స్థాయిలో పత్తి మొలకెత్తే అవకాశం లేదంటున్నారు.



వర్షాలు లేక వాడిపోతున్న పత్తి మొక్కలు

మేఘాలు కమ్ముకుంటున్నా..

వారం రోజులుగా ఉరుములు, మెరుపులతో ఆశలు రేకెత్తిస్తున్నాయి. రోజూ మేఘాలు కమ్ముకొస్తున్నాయి. అప్పటికప్పుడు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురుస్తుందేమోనన్న పరిస్థితి ఏర్పడుతోంది. అంతలోనే గాలులు వీస్తుండడంతో మేఘాలు తేలిపోతున్నాయి. రోజూ ఇదే పరిస్థితి ఎదురవుతోంది. వర్షాలు కురుస్తాయని రైతులు ఆకాశంవైపు చూడడం.. అంతలోనే మేఘాలు ముఖం చాటేయడంతో నిరాశ చెందుతున్నారు.

వర్షాలు కురవాలి వాన దేవుడా

'వర్షాలు కురవాలి ఓ వాన దేవుడా అంటూ' మహిళలు పాటలు పాడుతూ కప్పాట ఆడుతున్నారు. షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో ఆదివారం మహిళలు, చిన్న పిల్లలు ఓ రోకలికి కప్ప, వేపకొమ్మలను కట్టి ఇంటింటికీ తిరుగుతూ పాటలు పాడారు. వానలు కురవాలని దేవుడిని ప్రార్థించారు.



షాబాద్ మండలం తాళ్లపల్లిలో కప్పాట ఆడుతున్న గ్రామస్తులు

ఆశతో పత్తి వేశా..



20 రోజుల క్రితం కురిసిన వర్షానికి పది ఎకరాలల్లో పత్తి పంట సాగు చేశాను. వానలు పడతాయని ఆశతో పంట వేశాను. ఇప్పుడు వర్షాలు లేకపోవడంతో విత్తిన పత్తి పూర్తిగా మొలకెత్తుతుందో లేదోనని ఆందోళనగా ఉంది. వర్షాల కోసం ఎదురుచూస్తున్నాం.

– విజయభాస్కర్‌రెడ్డి, రైతు, మరియాపురం, షాబాద్ మండలం

వానాకాలం ప్రారంభమైనా..



వానాకాలం ప్రారంభమైనా వానలు పడడం లేదు. ఏటా ఇదే పరిస్థితి ఉండటంతో సకాలంలో విత్తనాలు విత్తలేక పోతున్నాం. ఇప్పటివరకు పత్తి, జొన్న, మొక్కజొన్న పంటలు విత్తడం పూర్తి కావాలి. వానలు లేక నిత్యం ఆకాశం వైపు చూస్తున్నాం.

– అసిగారి బాల్‌రాజ్, రైతు తాళ్లపల్లి, షాబాద్ మండలం



మైనింగ్ అనుమతులు రద్దు చేయాలంటూ తీర్మానం చేసిన గ్రామస్తులు

మైనింగ్ జోన్ ఏర్పాటు చేయొద్దు

ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకిస్తూ అంతారం గ్రామస్తుల తీర్మానం

చేవెళ్ల: మండలంలోని అంతారం సమీపంలో చేపడుతున్న మైనింగ్ జోన్ ఏర్పాటును పూర్తిగా రద్దు చేయాలని గ్రామస్తులంతా ఏకోన్ముఖంగా తీర్మానం చేశారు. ఆదివారం అంతారం గ్రామ పంచాయతీ వద్ద గ్రామస్తులంతా కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచలింగాల గుట్ట దగ్గర చేపడుతున్న మైనింగ్ అనుమతుల కోసం ఈనెల 27న చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణను గ్రామస్తులంతా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. గ్రామంలోని సర్వే నంబర్ 185లో ఎస్ఆర్ మినరల్స్ మైనింగ్ తవ్వకాల జరుపుతుందని.. కొత్తగా మరో 27 ఎకరాలకు అనుమతుల కోసం చేస్తున్న ప్రతిపాదనలను రద్దు చేయాలన్నారు. పర్యావరణ అనుమతులు కోసం జరగబోయే ప్రజాభిప్రాయ సేకరణను విరమించుకోవాలని గ్రామ సభలో ప్రజలు సంతకాల సేకరణ నిర్వహించినట్లు తెలిపారు. మైనింగ్ వల్ల జరిగే దుష్పరిమాణాలను గ్రామస్తులంతా అనుభవించామని అందుకే ఈ మైనింగ్ తమకు వద్దని నినదించారు. ఇప్పుడైన అధికారులు స్పందించి ఎలాంటి మైనింగ్‌కు అనుమతులు ఇవ్వకూడదన్నారు. లేదంటే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు అంజన్‌గౌడ్, మాణిక్యం, వీరస్వామి, ఎల్లయ్య, ఆంజనేయులు, నరేందర్, సత్యనారాయణ, శ్రీశైలం, సుధాకర్ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగు భూసారం బాగు

- సాగుచేస్తే సుస్థిరమైన దిగుబడి
- రసాయన ఎరువులతో రైతులకు అధిక ఖర్చు
- షాబాద్ వ్యవసాయ అధికారి వెంకటేశం



షాబాద్: వ్యవసాయంలో ఆధునిక, యాంత్రిక పద్ధతుల ప్రవేశంతో అధిక దిగుబడులు సాధించాలన్న లక్ష్యంతో రైతులు ముందుకు సాగుతున్నారు. దీనికి రసాయన ఎరువులను ఇబ్బడి ముబ్బడిగా వినియోగిస్తున్నారు. దీంతో సేంద్రియ ఎరువుల వాడకం ప్రస్తుతం పూర్తిగా తగ్గిపోతోంది. మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకంతో భూమిలోని పోషకాల సమతుల్యత దెబ్బతినడంతో పాటు, వేసిన పంటలకు చీడపీడల బెడద పెరిగి దిగుబడులు తగ్గిపోతాయని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి పచ్చిరొట్ట పైర్ల సాగు ఉపయోగపడుంది. దీంతో భూసారం పెంచుకోవచ్చు. ప్రస్తుతం పచ్చిరొట్ట పైర్ల సాగుపై మండల వ్యవసాయ అధికారి వెంకటేశం రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

జీలుగ

ఎకరానికి 12 నుంచి 15 కిలోల విత్తనాలు సరిపోతాయి. చౌడు భూములు, ఇసుక నేలల్లో సాగు చేయొచ్చు. ముఖ్యంగా వరి సాగు చేసే భూములకు జీలుగ పైరు చాలా అనుకూలంగా ఉంటుంది. పూత దశలో పొలంలో కలియ దున్నడంతో ఎకరానికి 8 నుంచి 10 టన్నుల వరకు పచ్చిరొట్ట లభిస్తుంది. ఒక టన్ను పచ్చిరొట్టలో 6 కిలోల నత్రజని, 1.15 కిలోల భాస్వరం, 5 కిలోల పొటాష్‌లు పుష్కలంగా లభిస్తాయి.

జనుము

ఎకరానికి 12 నుంచి 15 కిలోల విత్తనాలు చల్లుకోవాలి. జనుములను అన్ని నేలల్లో సాగు చేయడానికి అవకాశం ఉంది. ఇది పచ్చిరొట్టగా, పశుగ్రాసంగా ఉపయోగపడుతుంది. పూత దశలో పొలంలోనే కలియదున్నుకోవాలి. ఎకరానికి 4 నుంచి 6 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది.

పిల్లి పెసర

ఎకరానికి 6 నుంచి 8 కిలోల విత్తనాలు చల్లుకోవాలి. చౌడు భూములకు అనుకూలం కాదు. పచ్చిరొట్టగానూ, పశుగ్రాసంగానూ ఉపయోగపడుతుంది.



జనుము పంట

ఎకరానికి 4 నుంచి 6 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. టన్ను పచ్చిరొట్టలో 7 కిలోల నత్రజని, 1 కిలో భాస్వరం 5 నుంచి 6కిలోల పొటాష్‌లు లభిస్తాయి.

అలసందలు

ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలను చల్లుకోవాలి. పశువులకు మేతగా కూడా వినియోగించొచ్చు. అలసందలు నీటి ఎద్దడిని తట్టుకుంటాయి. ఎకరానికి 4 నుంచి 6 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది.

పెసర

ఎకరానికి 8 కిలోల విత్తనాలను చల్లుకోవాలి. తొలకరి వానలకు చల్లిన పైరులో కాయలు కోసిన తర్వాత మిగిలిన రొట్టను భూమిలో కలియ దున్నుకోవలి. కాయల ద్వారా రైతులకు మరింత ఆదాయం సమకూరుతుంది.

దున్నకంలో మెలకువలు

- పచ్చిరొట్ట పైరు కాలం 60 నుంచి 70 రోజులు, ప్రధాన పంట సాగు చేయడానికి 60 రోజుల వ్యవధి ఉన్నప్పుడే సాగు చేయాలి. 40 నుంచి 50 రోజులకు పూత దశలో కలియ దున్నుకోవాలి. 10 నుంచి 15 రోజుల పాటు పచ్చిరొట్ట కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారుతుంది. దీంతో ప్రధాన పంటలకు పుష్కలంగా భూసారం లభిస్తుంది.
- పైర్లను కలియ దున్నే సమయంలో నేలలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. విత్తనాలు చల్లే సమయంలో 50 కిలోల సింగల్ పాస్ఫేట్ వేయడంతో పైరు త్వరగా పెరుగుతుంది.
- తేలిక పాటి నేలల్లో సాగు చేసే పైర్లకు 15 కిలోల యూరియా వేయడంతో ఎక్కువ పచ్చిరొట్ట దిగుబడి వస్తుంది. పచ్చిరొట్టను సకాలంలో పూత దశ వచ్చిన వెంబడే కలియదున్నడంతో త్వరగా కుళ్లిపోయి భూసారం పెరుగుతుంది.
- పచ్చిరొట్ట సాగుతో రసాయన ఎరువుల వాడకాన్ని 25 శాతం తగ్గించుకొని నాణ్యమైన సుస్థిరమైన పంట దిగుబడులను సాధించవచ్చు.

ఎమ్మెల్యే సమావేశం వాయిదా



డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద భారీగా చేరుకున్న లబ్ధిదారులు

- కాంగ్రెస్ పార్టీ నిరసనతో పోలీసుల ముందస్తు చర్యలు
- పడిగాపులు కాసిన డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు

మహేశ్వరం: మండలంలోని మన్సాన్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు భవన సముదాయాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సబితారెడ్డితో ఏర్పాటు చేసిన సమావేశం వాయిదా పడింది. ఆదివారం సభను నిర్వహించేందుకు రెండు పడకల ఇళ్ల లబ్ధిదారులు ఏర్పాట్లు చేయగా అదే సమయంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు 'చలో మన్సాన్‌పల్లి'కి పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో స్థానికేతరులకే డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించారని హస్తం పార్టీ నేతలు ఆరోపిస్తూ నిరసనకు పూనుకున్నారు. ఈ సందర్భంగా ఇరుపార్టీలు ఘర్షణకు పాల్పడే అవకాశం ఉండడంతో పోలీసులు ఎమ్మెల్యే సబితారెడ్డికి, కాంగ్రెస్ నాయకులకు నోటీసులు ఇచ్చారు. ఇరువర్గాలు మన్సాన్‌పల్లికి వెళ్లవద్దని సూచించారు. దీంతో పోలీసులు డబుల్ బెడ్రూం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. లబ్ధిదారులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జాం అయింది.

విద్యార్థి అదృశ్యం



ప్రతీక్ (ఫైల్)

శంషాబాద్: స్కూల్‌లో జరుగుతున్న గొడవపై తండ్రి మందలించడంతో విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ బాలరాజు తెలిపిన మేరకు.. పట్టణంలోని నక్షత్ర కాలనీలో నివాసముండే డాక్టర్ రాజేష్ కుమారుడు ప్రతీక్ (13) జీఎంఆర్ చిన్మయ విద్యాలయంలో 8 తరగతి చదువుతున్నాడు. స్కూల్‌లో గొడవ పడుతున్నాడని తరగతి ఉపాధ్యాయుడు ప్రతీక్ తండ్రిని శనివారం స్కూల్‌కు పిలిపించి చెప్పాడు. ప్రతీక్‌ను ఇంటికి వచ్చిన తర్వాత తండ్రి మందలించాడు. సాయంత్రం కరాటే క్లాస్‌కు వెళుతున్నాని చెప్పి బయలుదేరిన అతడు రాత్రి వరకు తిరిగి రాలేదు. అన్ని చోట్లా వెతికినా ఆచూకి లభించకపోవడంతో ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌కు నాయకుల వినతి

ఆమనగల్లు: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడైన హుస్సేన్‌నాయక్‌కు ఆమనగల్లు పట్టణంలో బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ పర్యటనకు వెళుతున్న హుస్సేన్‌నాయక్‌కు పట్టణంలోని రాజీవ్ చౌరస్తా వద్ద నాయకులు గుమిగూడారు. ఈ సందర్భంగా హుస్సేన్‌నాయక్‌ను ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్ శాలువాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు సాయి, రవి రాథోడ్, పద్మఅనిల్, శ్రీశైలంయాదవ్, రాములునాయక్, చెన్నకేశవులు, కృష్ణనాయక్, విక్రంరెడ్డి, నర్సింహ, ఆనంద్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్టతండా పక్కన గిరిజన రైతుల భూములను కొందరు ఆక్రమించుకుంటున్నారని దీనిపై విచారణ జరిపి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని హుస్సేన్‌నాయక్‌కు స్థానిక నాయకుడు నరేందర్‌రాథోడ్ వినతిపత్రం అందించారు.



కడ్తాల్: మైసిగండి సన్నిధిలో హుస్సేన్‌నాయక్, నాయకులు

మైసిగండి మైసమ్మ సేవలో..

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని ఆదివారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటవత్ హుస్సేన్‌నాయక్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి హుస్సేన్‌నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువా, పూలమాలతో ఆయనను సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సాయిలాల్‌నాయక్, నాయకులు రెడ్యానాయక్, లక్ష్మణ్‌నాయక్, భాస్కర్‌నాయక్, వెంకటేశ్, శ్రీశైలం, శంకర్‌నాయక్, కుమార్‌నాయక్, శ్రీకాంత్‌నాయక్, డి.మహేశ్, మహేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆర్టీఐ అధికార ప్రతినిధి నియామకం

యాచారం: మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాస్‌యాదవ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్, హ్యూమన్ రైట్స్, ఆర్టీఐ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయవాది వృత్తిలో ఉంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం విశేష కృషి చేస్తున్నందుకుగాను శ్రీనివాస్‌యాదవ్‌కు ఈ పదవీ అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు.



అశోక్‌గౌడ్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్‌యాదవ్

గొర్రెల మందపై కుక్కల దాడి

12 మూగజీవాలు మృత్యువాత

షాద్‌నగర్‌రూరల్: గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 12 జీవాలు మృత్యువాత పడిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండలంలోని కాశిరెడ్డిగూడ శివారులో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తోట చెన్నయ్య గొర్రెలను మేపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం గొర్రెల మందను తన వ్యవసాయ పొలం వద్ద పాకలో కొట్టి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం చెన్నయ్య కుమారుడు శ్రీశైలం మంద వద్దకు వెళ్లి చూడగా.. అందులో కొన్ని గొర్రెలు చనిపోయి చల్లా చదురుగా పడి ఉన్నాయి. మరికొన్ని గొర్రెలపై కుక్కలు దాడి చేస్తుండగా గమనించి వాటిని తరిమి కొట్టాడు. ఈ దాడిలో పది గొర్రెలు, రెండు మేకలు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న చెన్నయ్య పొలం వద్దకు చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించాడు. కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న వెటర్నరీ వైద్యుడు శ్రీధర్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. చెన్నయ్యను ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గొర్రె కళేబరాన్ని పరిశీలిస్తున్న వెటర్నరీ వైద్యుడు శ్రీధర్‌కుమార్

నిద్రమాత్రలు మింగిన దంపతులు

భర్త మృతి, భార్య పరిస్థితి విషమం

రాంగోపాల్‌పేట్: ఆర్థిక ఇబ్బందులతో దంపతులు నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా భర్త మరణించాడు, భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ ఘటన సెక్రటరియేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎల్‌బీ నగర్‌కు చెందిన రవీందర్‌కుమార్ (56) రాఖీ (49) భార్యాభర్తలు. రవీందర్‌కుమార్ ప్రైవేటు సంస్థలో పని చేస్తుండగా కొద్ది రోజుల నుంచి ఖాళీగా ఉంటున్నారు. గత కొద్ది రోజుల నుంచి ఈ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నెల 20న రాణిగంజ్‌లోని వసుంధర లాడ్జిలో భార్యాభర్తలు బస చేశారు. ఈ నెల 21వ తేదీన రాత్రి ఇద్దరూ లాడ్జీలో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. 22వ తేదీ ఉదయం రూంబాయ్ వచ్చి తలుపు కొట్టగా ఎలాంటి స్పందన కనిపించ లేదు. లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రవీందర్ కుమార్ ఆదివారం మధ్యాహ్నం మరణించాడు. భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

తల్లీపిల్లల అదృశ్యం

శంషాబాద్ రూరల్: తల్లీ, పిల్లలు అదృశ్యమైన ఘటన పెద్దతూప్రలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దిద్యాల యాదయ్య ఈ నెల 19న ఉదయం పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చే వరకు ఇంట్లో భార్య మమత, కుమారుడు భానుప్రసాద్(10), కూతురు వైష్ణవి(7) కనిపించలేదు. వారి గురించి వాకబు చేయగా ఉదయం స్కూలు బస్సు ఎక్కి ముగ్గురు వెళ్లినట్లు యాదయ్య తల్లి చెప్పింది. తర్వాత వారి ఆచూకీ కోసం అన్ని చోట్ల వెతికినా లభించలేదు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి కాలేదని పెట్రోల్ పోసుకొని..

వ్యక్తి బలవన్మరణం

మొయినాబాద్: పెళ్లి కావడంలేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన చేవెళ్ల కిరణ్‌కుమార్(40) గత కొంత కాలంగా అనారోగ్యానికి గురయ్యారు. ఆయనకి ఇంకా పెళ్లి కాలేదు. తన సోదరులకు సైతం వివాహం కాలేదు. అనారోగ్య కారణంతో పాటు పెళ్లి కావడంలేదని కొంత కాలంగా ఆయన మదనపడేవారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇంట్లో చిన్న గొడవ జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన కిరణ్‌కుమార్ బాటిల్లో పెట్రోల్ తెచ్చుకుని తమ ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నారు. వేగంగా మంటలు వ్యాప్తిచడంతో పూర్తిగా కాలిపోయి అక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



కిరణ్‌కుమార్ (ఫైల్)

స్టార్టప్ కంపెనీని ప్రారంభిస్తా

జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకర్ చందునాయక్

శంకర్‌పల్లి: ప్రముఖ ఐఐటీల్లో ఇంజనీరింగ్ సీటు సాధించి, స్టార్టప్ కంపెనీని ప్రారంభించడమే లక్ష్యమని జేఈఈ అడ్వాన్స్‌డ్ ఎస్టీ కేటగిరిలో ఆల్ ఇండియా 407 ర్యాంకు సాధించిన సభావత్ చందునాయక్ అన్నారు. మండలంలోని మోకిల తండాకి చెందిన శంకర్, దేవి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు. శంకర్ సెంట్రింగ్ పని చేస్తుండగా, దేవి వ్యవసాయ కూలీ. చందునాయక్ చిన్నప్పటి నుంచే చదువులో చురుకుగా ఉండడంతో తల్లిదండ్రులు యూసఫ్‌గూడలోని సోషల్ వెల్ఫేర్‌లో పదో తరగతి వరకు చదివించారు. అనంతరం కుమారుడి ఆసక్తిని గమనించిన దంపతులు పేదరికాన్ని సైతం లెక్కచేయకుండా కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చేర్పించారు. ఇంటర్మీయట్‌లో 966 మార్కులు సాధించగా.. ఇటీవల ప్రకటించిన జేఈఈ ఫలితాల్లో ఏకంగా 407 ర్యాంకుని సాధించి అందరిచేత ప్రశంసలు అందుకుంటున్నారు. ఆదివారం చందునాయక్‌ని స్థానిక అడ్వొకేట్ వర్త్య రవినాయక్ సన్మానించి, ఉన్నతస్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు.



చందును సన్మానిస్తున్న రవినాయక్, చిత్రంలో విద్యార్థి తల్లిదండ్రులు

పెండింగ్ పాల బిల్లులు చెల్లించాలి

- విజయ డెయిరీ అభివృద్ధికి సహకరించండి
- మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే కసిరెడ్డికి కాంగ్రెస్ నాయకుల వినతి

మాడ్గుల: విజయ డెయిరీ అభివృద్ధికి సహకరించాలని కాంగ్రెస్ మాడ్గుల మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను సకాలంలో చెల్లించాలని కోరారు. ఎంతో మంది పాడి రైతులు పాల ఉత్పత్తి సహకార సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం నడిపే విజయ డెయిరీలో ప్రతి రోజు పాలు విక్రయిస్తున్నారన్నారు. బిల్లుల చెల్లింపు సకాలంలో జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి బకాయిలు విడుదల చేయడంతో పాటు 15 రోజులకోసారి పాల బిల్లులు వచ్చేలా డెయిరీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే కసిరెడ్డి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ సాయిరెడ్డి, రైతులు, నాయకులు పాల్గొన్నారు.



మంత్రి జూపల్లితో నాయకులు